1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 278 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 24 సెప్టెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 278 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 24 September 2025 PAGES : 8 PRICE : 3/-

# విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 23)

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని మంత్రి నారా లోకేశ్ పునరుద్ఘాటించారు. వైకాపా ఎమ్మెల్సీ కల్యాణి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఇరు పక్షాల మధ్య వాడీవేడిగా చర్చ సాగింది. ఈ క్రమంలో అసభ్య పదజాలం వాడారన్న బొత్స వ్యాఖ్యలపై లోకేశ్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని వందసార్లు చెబుతున్నా. ప్రధాని ఏ కార్యక్రమం చేసినా ఏపీని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తున్నారు. ప్రభుత్వం తరఫున స్పష్టంగా చెప్పినా మీకు అర్థం కావట్లేదా? ప్రైవేటీకరణ జరగాలని వైకాపా కోరుకుంటున్నట్లుంది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని భాజపా, జనసేన, తెదేపాకు చాలా క్లారిటీ ఉంది. ఈ అంశంలో వైకాపాకు బొత్తిగా అవగాహన లేదు" అని ధ్వజమెత్తారు. అసత్యాలు ప్రచారం చేయడమే వైకాపా పనిగా పెట్టుకుందని మండిపడ్డారు.


**తల్లిని అవమానిస్తే.. ఆ బాధేంటో ప్రత్యక్షంగా చూశా!**

తల్లిని అవమానించిన వాళ్లు ఇవాళ గౌరవం గురించి మాట్లాడుతున్నారంటూ ప్రతిపక్షాలపై మంత్రి లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు మహిళలను గౌరవించడం నేర్పారంటూ పేర్కొన్నారు. "తల్లిని అవమానిస్తే ఆ బాధ ఏంటో నేను ప్రత్యక్షంగా చూశాను. మా తల్లిని నిండు సభలో అవమానించినప్పుడు మీకు గుర్తుకు రాలేదా? మా తల్లిని అవమానిస్తే ఆమె కోలుకునేందుకు 2 నెలలు పట్టింది. మా మహిళలపై కేసులు పెట్టినప్పుడు మీరు ఏం చేశారు? ఇప్పటికీ వైకాపా నేతలు మహిళలను దారుణంగా అవమానిస్తున్నారు. వైకాపా నేతలకు మహిళల గౌరవంపై మాట్లాడే హక్కు లేదు" అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

**టీసీఎస్‌ని ఏకపక్షంగా రద్దు చేశారు..**

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులపై స్వల్ప కాలిక చర్చలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. "2014-19లో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు తీసుకొచ్చాం. కియా పరిశ్రమ రాకతో అనంతపురం జిల్లా రూపురేఖలు మారాయి. కియా రాకముందు ప్రజల తలసరి ఆదాయం రూ.70వేలు ఉండేది. ఆ పరిశ్రమ వచ్చాక తలసరి ఆదాయం 2.30లక్షలకు పెరిగింది. టీసీఎల్‌ను రేణిగుంటలో ఏర్పాటు చేస్తే ఉత్పత్తి ప్రారంభించింది. గన్నవరం వద్ద హెచ్‌సీఎల్‌ను ఏర్పాటు చేశాం. రాష్ట్రంలో అనేక పరిశ్రమలు ఏర్పాటుకు ఎంవోయూలు చేసుకున్నాం. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఏకపక్షంగా టీసీఎస్‌ను రద్దు చేశారు" అని గత వైకాపా పాలనపై విరుచుకుపడ్డారు. -మిగతా 2లో

## 'ప్రైవేటు'లో 90 శాతం సిజేరియన్లే.. ఇది సరికాదు సీఎం చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 23)

రాష్ట్రంలో 90 శాతం సిజేరియన్ ఆపరేషన్లు ప్రైవేటు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని.. తమ ప్రభుత్వం ఇలాంటి ధోరణిని ఏమాత్రం ఆమోదించబోదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గర్భిణులకు సురక్షిత ప్రసవంపై అవగాహన కల్పించాలని, యోగా నేర్పించే పరిస్థితి రావాలని.. దీనిపై ఇప్పట్నుంచే శ్రద్ధ పెట్టాలని, పిలిచి మాట్లాడాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు సూచించారు. వైద్యారోగ్యశాఖపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి ఈమేరకు మాట్లాడారు."ఎప్పుడైనా సరే ఆపరేషన్.. ఆపరేషనే. భగవంతుడు ఇచ్చిన సహజసిద్ధమైన శరీరాన్ని కోయడం మంచిది కాదు. సిజేరియన్‌లో అగ్రస్థానంలో ఉన్నాం.. ఇది సరికాదు. ఇలాంటివి ఎలా నియంత్రించాలో ఆలోచించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో 98 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరిగితే.. అందులో 42 శాతం ప్రభుత్వాస్పత్రుల్లో జరుగుతున్నాయి" అన్నారు.

"ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కావాలనేది మనందరి ఆకాంక్ష. వచ్చే ఏడాదికి రాష్ట్రంలో 5.37 కోట్ల మంది జనాభా ఉంటారు. 2047 నాటికి చైనా జనాభా వంద కోట్లే ఉంటుంది. అప్పటికి భారత్‌లో 162 కోట్లు అవుతుంది. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా క్రమంగా తగ్గుతోంది. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ తగ్గిపోతోంది. యూపీ, బిహార్ వల్లే భారత్‌లో జనాభా బ్యాలెన్స్ అవుతోంది. ఏపీలో పీహెచ్‌సీల సంఖ్య.. జాతీయ సగటు కంటే ఎక్కువగానే ఉంది. డబ్ల్యూహెచ్‌వో ప్రకారం మెడికల్ ఆఫీసర్లు మన వద్ద ఎక్కువే ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.15 లక్షల మంది వైద్యులు ఉన్నారు. మన దేశంలో సగటు జీవిత కాలం-మిగతా 2లో

## ప్రజాధనం.. మీ నేత విగ్రహాలకా?: సుప్రీంకోర్టు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,సెప్టెంబర్ 23)

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే దివంగత నేత కరుణానిధి విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తప్పుపట్టింది . 'మీ నేతలను కీర్తించేందుకు ప్రజాధనాన్ని ఎలా వినియోగిస్తారు" అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ప్రభుత్వం తన పిటిషన్‌ను ఉపసంహరించుకొని, ఈ వ్యవహారంపై మద్రాస్ హైకోర్టునే ఆశ్రయించాలని సూచించింది.

తిరునెల్వేలి జిల్లాలోని వల్లియూర్ వెజిటేబుల్ మార్కెట్ ప్రవేశద్వారం వద్ద కరుణానిధి కాంస్య విగ్రహం ఏర్పాటుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోరింది. ఆ పిటిషన్‌పై అసహనం వ్యక్తంచేసిన అత్యున్నత న్యాయస్థానం .. గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాల ఏర్పాటుకు అనుమతిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వలేదని హైకోర్టు అప్పుడు స్పష్టంచేసింది. ఇలాంటి ఏర్పాట్ల వల్ల ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడతారని అనుమతి నిరాకరించింది. విగ్రహాల ఏర్పాటుకు ఎలాంటి అనుమతి ఇవ్వకూడదంటూ -మిగతా 2లో

## ప్రతి వర్గానికీ ప్రయోజనం

**జీఎస్టీ ఆదాతో అన్ని ప్రాంతాల అభివృద్ధికి దోహదం**

**దేశ ప్రజలకు ప్రధాని బహిరంగ లేఖ**

అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈటానగర్‌లో ఏర్పాటు చేసిన స్థానిక ఉత్పత్తుల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రధాని మోదీ




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,సెప్టెంబర్ 23)

తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణలు ఖర్చులను తగ్గించి సమాజంలోని ప్రతి వర్గానికీ ప్రత్యక్షంగా ప్రయోజనం కలిగిస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. "ఈరోజు దేశవ్యాప్తంగా జీఎస్టీ సంస్కరణలు అమలులోకి వచ్చాయి. అవి ప్రజలపై అనుకూల ప్రభావం చూపడం ప్రారంభమైంది. జీఎస్టీ మిగులు సంబరాలకు అంకురార్పణ జరిగింది" అని భారతీయులందరినీ ఉద్దేశించి సోమవారం రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. దీన్ని ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 2047 నాటికి 'వికసిత భారతాన్ని' ఆవిష్కరించాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు ఈ సంస్కరణలు అనివార్యమయ్యాయని తెలిపారు. "ఈ సంవత్సరం పండగ సీజన్ మరో సంతోషాన్ని తెచ్చిపెట్టింది. మేం ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణలు రైతులు, మహిళలు, యువత, పేద, మధ్య తరగతి ప్రజలు, వ్యాపారులకు ప్రత్యక్షంగా ప్రయోజనం కలిగిస్తాయి. దుకాణదారులు జీఎస్టీ సంస్కరణలకు పూర్వం, తరువాత అంటూ ధరల బోర్డులు పెట్టడం ఆనందంగా ఉంది. రూ.12 లక్షల -మిగతా 2లో

## గత ప్రభుత్వం చాలా మందిపై అక్రమ కేసులు పెట్టింది హోంమంత్రి అనిత



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 23)

ఉద్యోగులు, ఉపాధ్యాయులు సహా అంగన్వాడీలు, ఆశావర్కర్లు తదితరులపై గత వైకాపా ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులను త్వరగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని హోంమంత్రి అనిత అన్నారు. పోలీసు, లా డిపార్టుమెంట్‌తో సమన్వయం చేసుకుంటూ కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ టీచర్లు ఆందోళనకు దిగితే 149 కేసులు పెట్టారని.. ఇప్పటి వరకు 80 శాతం కేసులను ఎత్తివేశామన్నారు. మిగిలినవాటినీ త్వరలో తొలగిస్తామన్నారు. 2019-24 మధ్య కాలంలో తప్పుడు క్రిమినల్ కేసుల పరిష్కారంపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాల్లో జనసేన ఎమ్మెల్సీ నాగబాబు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు.

గత ప్రభుత్వం చాలా మందిపై అక్రమ కేసులు పెట్టిందని మంత్రి అన్నారు. అమరావతి రైతులు రాజధానిని కోరుకుంటే వందలాది మందిపై కేసులు పెట్టారన్నారు. గత ప్రభుత్వం తనపైనా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడితే కడప కోర్టుకు హాజరైనట్లు తెలిపారు. చీకటి జీవోలు తెచ్చే సంస్కృతి కూటమి ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. రికార్డులు, లా ప్రకారం కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.

## విప్రో క్యాంపస్ నుంచి వాహనాలను అనుమతించండి: అజీమ్ ప్రేమ్‌జీకి సీఎం లేఖ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,సెప్టెంబర్ 23)

బెంగళూరులో ట్రాఫిక్ రద్దీపై తీవ్ర విమర్శలు వస్తుండడంతో రద్దీని నియంత్రించేందుకు సిద్ధరామయ్య సర్కారు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విప్రో వ్యవస్థాపకుడు అజీమ్ ప్రేమ్‌జీ కి సీఎం లేఖ రాశారు. బెంగళూరులోని విప్రో క్యాంపస్‌లోపలి నుంచి కొన్ని వాహనాలను అనుమతించాలని కోరారు. దీనివల్ల ఆ చుట్టుపక్కల రహదారులపై ట్రాఫిక్ రద్దీ 30శాతం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కొద్ది మొత్తంలో వాహనాలను అనుమతించినా ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు గణనీయమైన ఉపశమనం కలుగుతుందని సిద్ధరామయ్య లేఖలో పేర్కొన్నారు. ఐటీ సంస్థలకు నెలవైన బెంగళూరులోని ఔటర్ రింగ్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండడంపై ప్రయాణికులు, పౌర సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బెంగళూరులో రోడ్ల పరిస్థితిపై 'బ్లాక్‌బక్' అనే కంపెనీ సీఈవో రాజేశ్ యాబాజీ పెట్టిన పోస్టు తీవ్ర చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. -మిగతా 2లో

## విజయవాడ ఉత్సవ్‌ను విజయవంతం చేసేందుకు కూటమి నేతల కృషి: కేశినేని చిన్ని


(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 23)

తొలిరోజు విజయవాడ ఉత్సవ్ ఘనంగా జరిగిందని.. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. కూటమి నేతలు అందరూ కలిసి ఈ ఉత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. విజయవాడ ఉత్సవ్‌కు ఇవాళ రాష్ట్ర



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. బుధవారం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ రానున్నారని.. ఆయన తొలి పర్యటన విజయవాడ ఉత్సవ్‌తో ప్రారంభం కానుందన్నారు. ఇక్కడి సాంస్కృతిక ఉత్సవాలను తిలకించిన అనంతరం ఆయన తిరుపతికి వెళ్తారని చెప్పారు. విజయవాడ ఉత్సవ్‌కు ప్రముఖులు వస్తున్నారని.. 28న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. 29న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హాజరవుతారని చెప్పారు.

## ఆవ భూముల కుంభకోణం.. విజిలెన్స్ విచారణ ప్రకారం చర్యలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 23)

ఆవ భూముల కుంభకోణంపై విజిలెన్స్ విచారణ ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏపీ గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణంపై శాసనసభ ప్రశ్నోత్తరాల్లో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు నిర్మించాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరారు. చాలా చోట్ల గత ప్రభుత్వం సెంటు భూమిలో ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన స్థలాలు ఖాళీగా ఉన్నాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సభ దృష్టికి తీసుకొచ్చారు. సభ్యులు లేవనెత్తిన అంశాలపై మంత్రి పార్థసారథి సమాధానమిచ్చారు. -మిగతా 2లో

# పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పి4 శిక్షణ

## నగర కమిషనర్ కె వెంకటేశ్వరరావు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 23)**

స్వర్ణాంధ్ర 2047లో భాగంగా ఆంధ్రప్రదేశ్లో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పి4 శిక్షణ కార్యక్రమం మంగళవారం మండల స్థాయిలో ఎన్టీఆర్ కళా ప్రాంగణం నందు వార్డు కార్యదర్శులకు శిక్షణ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమానికి ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ కె వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారి యొక్క అమూల్యమైన సందేశాన్ని ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశంని సచివాలయం సెక్రటరీకి చక్కగా వివరించారు.

ఆర్థికంగా స్థిరపడిన టాప్ 10 శాతం

కుటుంబాలు మార్గదర్శకులుగా ఉంటూ అత్యంత పేదరికంలో దిగువన 20 శాతం ఉన్నటువంటి బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని ఆ దత్తత తీసుకున్నటువంటి కుటుంబాలకి వాళ్ల యొక్క కనీస అవసరాలు ఏ విధంగా తీర్చాలి మరియు అందులో మార్గదర్శికి బంగారు కుటుంబానికి సమన్వయకర్త లుగ సచివాలయం సిబ్బంది ఎలా పని చేయాలి అని కమీషనర్ సచివాలయం సిబ్బందికి వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టబడిన మొబైల్ అప్లికేషన్ ఏ విధంగా ఉపయోగించాలి, బంగారు కుటుంబానికి మారదర్శికి మధ్య జరిగేటటువంటి అన్ని వివరములు ఫోటో, డాక్యుమెంట్ రూపంలో రికార్డు చేయడంలో సచివాలయ సిబ్బంది ప్రముఖ పాత్ర వహిస్తారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ అయినా రసూల్, గౌస్ బాషా, శ్రీధర్ , శివశంకర్ మరియు భాగ్యలక్ష్మి మిగతా సచివాలయ ఉద్యోగులందరికీ ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ఈ ట్రైనింగ్ కార్యక్రమంకు పి4 అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి రవీంద్ర హాజరయ్యారు.

## మొదటి పేజీ తరువాయి

# 'ప్రైవేటు'లో 90 శాతం సిజేరియన్లే.. ఇది సరికాదు సీఎం చంద్రబాబు

70 ఏళ్లుగా ఉంది. ఇమ్యునైజేషన్ 97 శాతం సాధించాం. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు 78 శాతం సాధించాం. త్వరలోనే వంద శాతం సాధిస్తాం. గర్భిణుల్లో అనీమియా 32 శాతంగా ఉంది" అని వివరించారు.

ప్రజారోగ్యంపైనా రాజకీయాలే!

ప్రజల ఆరోగ్యం విషయంలో కొందరు రాజకీయాలు చేయడంపై మండిపడ్డారు. కొందరు ఏమీ తెలియకుండానే మాట్లాడుతూ రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తున్నారన్నారు. "ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజ్ ఉండాలని చెప్పింది నేనే. ప్రస్తుతం రాష్ట్రంలో 38 వైద్య కళాశాలలు ఉన్నాయి. వైకాపా హయాంలో 17 వైద్య కళాశాలలకు రూ.1550 కోట్లు ఇచ్చారు. సాలూరులో ట్రైబల్ వర్సిటీ పూర్తి చేసే బాధ్యతను మేం తీసుకున్నాం. వైకాపా చేసినట్లు మేం కూడా చేస్తే మరో 15 ఏళ్లు పడుతుంది. వైద్య కళాశాలల విషయంలో పీపీపీ విధానంలో ముందుకెళ్తున్నాం. మేంవచ్చాక కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్లు పెరిగాయి. పీపీపీ అంటే తెలుసుకోవాలి. ఆర్థిక సంస్కరణల్లో భాగం. అనేక రంగాల్లో పీపీపీలు వస్తున్నాయి. సంపద సృష్టి జరిగింది. ఈ విధానం కింద పెట్టుబడిదారులు వస్తున్నారు" అని తెలిపారు.

# విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు

ఒక్క కంపెనీ తీసుకురావడం ఎంత కష్టమో.. మాకు తెలుసు

"విశాఖలో పెట్టుబడులు పెట్టకుండా లులూ సంస్థను పంపించేశారు. ఏపీలో వద్దని లులూ, అమరరాజా సంస్థలు అప్పట్లో నిర్ణయించాయి. వైకాపా ప్రభుత్వ వైఖరితో అనేక ప్రతిష్ఠాత్మక సంస్థలు వెళ్లిపోయాయి. సింగపూర్ ప్రభుత్వంతో సింగపూర్ ప్రభుత్వంతో మాట్లాడకుండా ఏకపక్షంగా ఒప్పందాలు రద్దు చేశారు. ఒక్క కంపెనీ తీసుకురావడం ఎంత కష్టమో ఆ బాధ, ఆవేదన మాకు తెలుసు. 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని అమలు చేసేందుకు యత్నిస్తున్నాం. ఏ రాష్ట్రంలో లేని విధంగా 25 వరల్డ్ క్లాస్ పాలసీలు తీసుకొచ్చాం. క్వాంటమ్ వ్యాలీ, గూగుల్, టీసీఎస్ సహా పలు సంస్థలు రాష్ట్రానికి రప్పించాం. 16 నెలల్లో రూ.10.4లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 340 ఎంవోయూలు చేసుకున్నాం. మరో రూ.3లక్షల కోట్ల పెట్టుబడులకు చర్యలు తీసుకొంటున్నాం. లార్జెస్ట్ ఫుడ్ ప్రాసెస్ యూనిట్‌ను కర్నూలుకు తెచ్చాం. ఆదిత్య మిత్తల్‌తో మాట్లాడి.. వారు అడిగిన అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాం. స్టీల్ ప్లాంట్ నిర్మించేలా చర్యలు తీసుకొంటున్నాం. డేటా సెంటర్‌ను ఏపీలో పెట్టాలని గూగుల్ ప్రతినిధులు కోరగా అంగీకరించారు. దావోస్‌లో కాగ్నిజెంట్ ప్రతినిధులతో మాట్లాడి ఎకరా భూమి రూపాయికే ఇస్తానని హామీ ఇచ్చా. నేనిచ్చిన హామీతో విశాఖలో పెట్టుబడులకు కాగ్నిజెంట్ సమ్మతించింది. ఆ పరిశ్రమ ద్వారా 25వేల మందికి విశాఖ ఉద్యోగాలు వస్తున్నాయి" అన్నారు.

# ప్రజాధనం.. మీ నేత విగ్రహాలకా? సుప్రీంకోర్టు

గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని గుర్తుచేసింది. ఆ నేపథ్యంలో ప్రభుత్వాలు అనుమతి ఇవ్వడం సాధ్యంకాదని తేల్చిచెప్పింది. తమిళనాడు రాజకీయాలపై కరుణానిధి చెరగని ముద్ర వేశారు. దశాబ్దాల పాటు డీఎంకే పార్టీని నడిపిన ఆయన.. ఐదుసార్లు ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. తమిళం మాట్లాడే ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు.

# ప్రతి వర్గానికీ ప్రయోజనం

వార్షిక ఆదాయం వరకూ ఆదాయపన్నును సున్నా శాతానికి తగ్గించడం ద్వారా ప్రజలకు ప్రయోజనం కలిగించాం. ఆదాయపన్ను రాయితీ, జీఎస్టీ సంస్కరణల్ని కలిపితే దేశ ప్రజలకు రూ.2.5 లక్షల కోట్లు ఆదా అవుతున్నాయి. 2017లో ప్రారంభమైన జీఎస్టీ.. ప్రజలు, వ్యాపార సంస్థలను బహుళ పన్నుల జాలం నుంచి విముక్తి కలిగించింది. తాజా సంస్కరణలు 'ఆత్మనిర్భర్ భారత్' ఆవిష్కారానికి దోహదపడతాయి. దుకాణదారులు, వ్యాపారులు భారత్‌లో ఉత్పత్తయిన వస్తువుల్ని మాత్రమే విక్రయించాలి. ఈ పండగ సీజన్‌లో జీఎస్టీ ఆదా ఉత్సవాన్ని జరుపుకొందాం" అని మోదీ పిలుపునిచ్చారు.

# విప్రో క్యాంపస్ నుంచి వాహనాలను అనుమతించండి అజీమ్ ప్రేమ్‌జీకి సీఎం లేఖ

'గతంలో ఇంటినుంచి కార్యాలయానికి వెళ్లి రావడం తేలికగా ఉండేది. ఇప్పుడు అది కఠినంగా మారిపోయింది. ఆఫీసుకు రావాలంటే మా ఉద్యోగులకు గంటన్నర పడుతుంది. రహదారులన్నీ గుంతలు, దుమ్ముతో నిండిపోయాయి. గత ఐదేళ్లలో ఈ పరిస్థితుల్లో మార్పేమీ రాలేదు. మేము ఇక్కడినుంచి వెళ్లిపోదామని నిర్ణయించుకున్నాం' అంటూ రాజేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ పోస్టుపై పలువురు నేతలు సైతం స్పందిస్తుండడంతో రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

బెంగళూరులో గుంతల రోడ్లపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బెంగళూరులోని అన్ని రహదారులపై మరమ్మతులు చేయడానికి అధికారులకు నెల రోజుల గడువు విధించారు. గడువు లోపు పనులు పూర్తి చేయకపోతే చీఫ్ ఇంజినీర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని సీఎం హెచ్చరించారు. ఈ క్రమంలోనే తాజాగా విప్రో వ్యవస్థాపకుడు అజీమ్ ప్రేమ్‌జీకి లేఖ రాశారు.

# ఆవ భూముల కుంభకోణం.. విజిలెన్స్ విచారణ ప్రకారం చర్యలు

అర్బన్ ప్రాంతాల్లోని ప్రజలకు గ్రామీణ ప్రాంతాల్లో స్థలాలు కేటాయించడంతో కొన్ని అభ్యంతరాలు వచ్చాయని మంత్రి చెప్పారు. గతంలో తెదేపా ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లను వైకాపా ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తిచేయకుండా బిల్లులను నిలిపివేసిందని.. రూ.900 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టిందని చెప్పారు. కొత్తగా ఇల్లు నిర్మించుకునేవారికి యూనిట్ ధర పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. జగనన్న కాలనీల ఇళ్ల కోసం చేపట్టిన భూసేకరణలో అక్రమాలు జరిగాయని చెప్పారు. వైకాపా ప్రభుత్వంలో కేటాయించిన ఇళ్లను ఆపకుండా నిర్మాణం పూర్తిచేసేందుకు తోడ్పాటు అందిస్తున్నామన్నారు.

కనిగిరి, గిద్దలూరు ఆస్పత్రుల్లో సిబ్బంది నియామకాలు చేపడతాం: మంత్రి సత్యకుమార్

మరోవైపు వైద్యారోగ్యశాఖపై వచ్చిన ప్రశ్నలకు ఆ శాఖ మంత్రి సత్యకుమార్ సమాధానమిచ్చారు. మార్కాపురంలో ఆసుపత్రి, వైద్యకళాశాల నిర్మాణం కోసం వైకాపా హయాంలో రూ.47 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. పీపీపీ విధానంలో వైద్యకళాశాలల నిర్మాణం చేయాలని నిర్ణయించామన్నారు. 640 పడకల ఆస్పత్రిని నిర్మిస్తున్నామని తెలిపారు. గిద్దలూరు, కనిగిరి, కోవూరు నియోజకవర్గ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపడతామన్నారు. ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. కనిగిరి ఆస్పత్రిని ఆధునీకరించేందుకు చొరవ చూపిన ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి మంత్రి అభినందలు తెలిపారు.

# గంగవరం రోడ్డు బాగుపడేది ఎప్పుడో..?

## చినుకు పడితే చిత్తడే.. అడుగు వేయాలంటే భయపడాల్సిందే.



**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, సెప్టెంబర్ 23)**

పుల్లలచెరువు నుండి గంగవరం వెళ్లే రహదారి చిన్న వర్షానికే బురదమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాకపోకలు కష్టసాధ్యమవుతుండడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పుల్లలచెరువు నుండి గంగవరం వరకు తార రహదారి కోసం ఒక కోటి 85 లక్షల రూపాయలు మంజూరు చేసినప్పటికీ, అప్పటి ఎమ్మెల్యే డేవిడ్ రాజ్ కేవలం శంకుస్థాపన చేసి రోడ్డు పనులు పూర్తి చేయలేదు. దీంతో రోడ్డు సమస్య ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఈ రహదారిని వెంటనే తార రహదారిగా మార్చకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మా గ్రామ ప్రజలు ఎన్నికలను బహిష్కరిస్తారు అని హెచ్చరించారు. ఈ సమస్యపై గ్రామ ప్రజలందరూ రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. అదేవిధంగా ఎస్సీ పాలానికి వెళ్లే రహదారి కూడా అధ్వాన్న స్థితిలో ఉందని, ఆ మార్గంలో నడవడం చాలా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గంగవరానికి వెళ్లే రహదారుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి డ్రోన్ కెమెరాలతో నిఘా

## జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 23)**

నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి జిల్లా వ్యాప్తంగా డ్రోన్ల సహాయంతో నిఘా ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. ఒంగోలు టౌన్ పరిధిలో ఇందిరమ్మ కాలనీ పరిసర ప్రాంతాలలో అకతాయిల అల్లర్లు చేస్తున్నారని స్థానికులు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వేంటనే స్పందించిన ఎస్పీ ఒంగోలు టౌన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ప్రత్యేక పోలీస్ బృందాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పరిసర ప్రాంతాలలో పోలీసు అధికారులు, పోలీస్ ప్రత్యేక బృందాలు ప్రజలతో మమైకమయ్యారు. ఏదైనా సమస్య వస్తే వేంటనే తమ దృష్టికి తీసుకురావాలని స్థానిక ప్రజలకు పోలీసులు తెలియచేశారు. సమాచారం ఇచ్చిన వారి విషయాలు గోప్యంగా ఉంచుతామని స్థానిక ప్రజలకు భరోసా ఇచ్చారు. అంతే కాకుండా అనుమానాస్పదంగా కనిపించిన యువకులను పోలీస్ సిబ్బంది ప్రశ్నించి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ కాలనీలో పరిసర ప్రాంతాలలో స్పెషల్ పార్టీ టీంలు జల్లెడ పట్టారు. హైవేల పై బైక్ రేసులు అరికట్టడంతో పాటు పేకాట స్థావరాలు, శివార్లలో ఓపెన్ డ్రింకింగ్ చేసి న్యూసెన్స్ క్రియేట్ చేయడం వంటి చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచి వాటిని నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలీసులు వెళ్లలేని ప్రదేశాలకు డ్రోన్లను పంపి అక్కడి పరిస్థితులను సమీక్షించే వీలుంటుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఒంగోలు నగరంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు.

# కలెక్టర్‌ను కలిసి ఉడా చైర్మన్ షేక్ రియాజ్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 23)**

జిల్లా కలెక్టర్ పి రాజా బాబును మంగళవారం ప్రకాశం భవనంలో ఉడా చైర్మన్ షేక్ రియాజ్ మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


## పాస్‌పోర్టు పోయినది

ప్రకాశం జిల్లా, పొదిలి మండలం, పొదిలి గ్రామానికి చెందిన షేక్ అల్తాఫ్ తండ్రి గౌస్ భాష ప్రస్తుతం ఒంగోలులో నివాసం ఉంటున్నాడు. 05/09/2025న ఒంగోలు నుంచి బస్సులో పొదిలికి చేరుకున్నాడు. అనంతరం ఆటోలో ఇంటికి వెళ్ళు క్రమంలో 7869689 నెంబరు గల పాస్ పోర్టు మరియు బ్యాగ్ మార్గమధ్యంలో పోయినది. షేక్ అల్తాఫ్ 7869689 నెంబరు గల పాస్ పోర్టు దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

**ఇట్లు**
**షేక్ అల్తాఫ్**
**తండ్రి గౌస్ భాష,**
**డోర్ నెం.37-1-166(7),**
**గుంటూరు రోడ్, కమలా నర్సింగ్ హోమ్**
**ఎదురు, ఒంగోలు, ప్రకాశం జిల్లా.**
**సెల్ నెం. 7013918251**
**(ఆధార్ నెం. 9778 9522 4366)**

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



దద్దాల వద్ద నాయకుల పంచాయతీ

ఎంపిపి ఏ పార్టీ అన్న ఓ వర్గం

సమన్వయ కమిటీ ఏర్పాటు

# కనిగిరిలో పీసీపల్లి వైసీపీ పంచాయతీ

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, సెప్టంబర్ 23)

కనిగిరిలో పీసీపల్లి మండల వైసీపీ పంచాయతీ మంగళవారం జరిగింది. పీసీపల్లి మండలానికి చెందిన వైసీపీ నాయకులు కొందరు ఎంపిపి జఘన్యతో కలిసి ఇటీవల జడ్పీటిసి వర్గం పై జిల్లా పార్టీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ జడ్పీటిసి వర్గానికి వత్తాసుగా వ్యవహరిస్తున్నారని బూచేపల్లికి ఫిర్యాదు చేశారు. మండలంలో వైసీపీ నాయకులు మూడు వర్గాలుగా ఏర్పడ్డారు. ఎంపిపి జఘన్య మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ వీర విధేయుడిగా ఉంటున్నారు. కనిగిరి ఇన్‌ఛార్జి పదవి బుర్రా మధుసూదన్ యాదవ్‌కు ఇవ్వాలంటూ ఎంపిపి జఘన్య రెండు నెలల క్రితం సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి బుర్రాకు ఇన్‌ఛార్జి ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అది తెలుసుకున్న దద్దాల వర్గం పీసీపల్లి ఎంపిపి జఘన్య టీడీపీతో కుమ్మక్కైయ్యాడని, చెన్నైలో ఉంటూ కేవలం మండల పరిషత్ సమావేశాలకు హాజరవుతున్నారని దద్దాల వర్గం అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. పార్టీ కార్యక్రమాల్లో కనిపించని ఎంపిపి జఘన్య ఇన్‌ఛార్జి పై ఫిర్యాదు చేయడం ఏమిటని ఆయన వర్గం ఆరోపిస్తుంది. వైసీపీకి చెందిన ఎంపిటిసిలు చెరుకూరి సతీష్, ప్రసూన, రామకృష్ణలు టీడీపీతో అంటగాకుతున్నారు.

వైసీపీకి రాజీనామా చేయకుండానే టీడీపీ నాయకత్వంతో చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతున్నారు. టీడీపీతో అంటకాగుతున్నా చెరుకూరి సతీష్‌కు ఎంపిపి జఘన్య మండలపరిషత్ నిధులన్నీ కట్టబెట్టడం ఏమిటని పీసీపల్లి వైసీపీలోని ఓ వర్గం ఇన్‌ఛార్జి దద్దాలతో మంగళవారం వాగ్వివాదానికి దిగినట్లు సమాచారం. ఇటీవల మార్కాపురం మెడికల్ కాలేజీ వద్ద నిరసన కార్యక్రమానికి వైసీపీ పిలుపునిచ్చింది. కనిగిరి నుండి వైసీపీ శ్రేణులు వెళ్ళారు. అయితే మాజీ ఎమ్మెల్యే బుర్రాకు తొత్తుగా వ్యవహరించే ఆ పార్టీ నాయకుడు సానికొమ్ము రంగనాయకులరెడ్డి బుర్రా ఆధ్వర్యంలో మార్కాపురం తరలివెళ్ళామని సోషల్ మీడియాలో ప్రకటనిచ్చారు. దాంతో ఆగ్రులైన వైసీపీ నాయకులు బుర్రా, రంగనాయకులరెడ్డిల పై విమర్శలు గుప్పించారు. పీసీపల్లి వైసీపీలో వర్గ పోరు శృతిమించడంతో ఇన్‌ఛార్జి దద్దాల రెండు వర్గాలతో మంగళవారం చర్చలు జరిపారు. పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు అందరూ సమిష్టిగా పని చేయాలని, సమన్వయంతో ముందుకు సాగాలంటూ పది మందితో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. ఒక వర్గానికి జడ్పిటిసి భర్త ఓకే రెడ్డి నాయకత్వం వహిస్తుండగా మరో వర్గానికి మాజీ సింగిల్ విండో అధ్యక్షులు జయరామిరెడ్డి పెద్దగా వ్యవహరిస్తున్నారు. జయరామిరెడ్డితో పాటు ఎంపిపి జఘన్య, చీమల బ్రహ్మారెడ్డి, యారవ నరసింహం, నరాల కొండారెడ్డి లను సమన్వయ కమిటీలో సభ్యులుగా ఉండాలని దద్దాల కోరినట్లు సమాచారం. జడ్పీటిసి వర్గంలో ఓకే రెడ్డి, కన్వీనర్ బొర్రారెడ్డి, ఎంపిటిసి భూమిరెడ్డి కొండారెడ్డి, (తరువాయి 4లో...)

# మానవత్వం చాటుకున్న వైసీపీ సోషల్ మీడియా టీం

మేమున్నాం అధైర్య పడొద్దు



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, సెప్టంబర్ 23)

ప్రకాశం జిల్లా వైయస్సార్ పార్టీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ మంత్రి మేరుగు నాగార్జున, స్టేట్ సోషల్ మీడియా అధ్యక్షుడు దొడ్డ అంజిరెడ్డి ఆదేశాల మేరకు గత మూడు రోజులుగా ఒంగోలులో ఓ ప్రైవేట్ హాస్పటల్లో వెంకటరమణ హాస్పిటల్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌తో అడ్మిట్ అయిన జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ ఊదరగుడి విజయ్ కుమార్‌ని పరామర్శించారు. అనంతరం వారికి రూ. 10వేలు ఆర్థిక సాయం, నిత్యావసరాల సరుకులను ప్రకాశం జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు వెన్న శివకృష్ణరెడ్డి, స్టేట్ సోషల్ మీడియా (తరువాయి 4లో...)

# వ్యవసాయాన్ని రైతుకు లాభసాటిగా చేయడమే లక్ష్యం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 23)

వ్యవసాయాన్ని రైతుకు లాభసాటిగా చేయడమే లక్ష్యంగా వ్యవసాయ సంబంధిత అధికారులు పనిచేయడంతో పాటు జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగంగా ఈ సంవత్సరం 15% వృద్ధిరేటే లక్ష్యంతో వ్యవసాయం, అనుబంధ శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు, వ్యవసాయ, అనుబంధ శాఖలైన హార్టికల్చర్, పశుసంవర్ధక, మైక్రో ఇరిగేషన్, సహకార, ప్రకృతి



వ్యవసాయం, మత్స్య శాఖల అధికారులతో సమావేశమై ఆయా శాఖల ద్వారా అమలు జరుగుచున్న కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించి దిశానిర్దేశం చేసారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, దాని అనుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధిరేటే లక్ష్యం సాధించేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని అందుకనుగుణంగా లక్ష్య సాధనకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో వ్యవసాయానికి అనుకూలంగా ఉండి నిరుపయోగంగా ఉన్న భూమిని సాగులోకి తీసుకువచ్చేందుకు వ్యవసాయ దాని (తరువాయి 4లో...)



# అంగన్‌వాడీలకు పురుగుల కందిపప్పు

కనిగిరిలో కార్యకర్తల ఆవేదన

పట్టించుకోని పౌరసరఫరాల శాఖ అధికారులు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, సెప్టంబర్ 23)

పసిపిల్లలకు మంచి పౌష్టికాహారం అందిస్తున్నామని పాలకులు, అధికారులు ప్రకటనలు గుప్పిస్తారు. కానీ ఆచరణలో కనపడడం లేదు. కనిగిరి పట్టణంలోని అంగన్ వాడీ కేంద్రాలకు సెప్టంబర్ నెల రేషన్‌లో భాగంగా కందిపప్పును సరఫరా చేశారు. అయితే ఆ కందిపప్పు అంతా నుసుం పట్టి తినడానికి పనికిరాకుండా ఉండే విధమైన కందిపప్పును పిల్లలకు వండిపెడితే ఏమవుతుందోననే భయంతో కార్యకర్తలు ఐసిడిఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. కనిగిరి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె సుమతి నాసిరకం కందిపప్పు ఇచ్చారని, ఇది పిల్లలకు ఎలా పెట్టాలంటూ గోడౌన్ డీటీని ఫోన్‌లో నిలదీశారు. కానీ ఆమె ఆవేదన పౌరసరఫరాల అధికారుల చెవికెక్కలేదు. సహనం కోల్పోయిన ఐసిడిఎస్ అధికారులు, కార్యకర్తలు నాసిరకం కందిపప్పు సరఫరా చేశారంటూ విలేకరులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి దృష్టికి వెలుగు ప్రతినిధి తీసుకెళ్ళగా నాసిరకం కందిపప్పు విషయమై గోడౌన్‌ల డిపో మేనేజర్‌తో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన కందిపప్పును సరఫరా చేసి పురుగుల పప్పును వెనక్కు తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.




# రాబోయే రోజుల్లో ప్రజలే అంతిమ తీర్పు ఇస్తారు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, సెప్టంబర్ 23)

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలో తీసుకొచ్చిన ఘనత దేశంలో ఒక్క జగన్ మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి అన్న రాంబాబు అన్నారు. మంగళవారం మార్కాపురంలోని జవహర్ నగర్ కాలనీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అన్నా రాంబాబు మాట్లాడుతూ 2023 వ సంవత్సరం నాటికి ఐదు మెడికల్ కాలేజీలు (తరువాయి 4లో...)



షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com


# గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, సెప్టంబర్ 23) గ్రామాలు పరిశుభ్రంగా ఉంచగలిగినప్పుడే జాతిపిత మహాత్మా గాంధీ కలలు కన్నా స్వచ్ఛమైన ఆరోగ్యమైన భారతదేశాన్ని నిర్మించుకోగలమని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పావులూరి ఉమాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని తలార్లపల్లి, చింతలచెరువు తదితర గ్రామాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో చెత్తను తొలగించి చెత్త తొలగించిన ప్రదేశాలలో చెట్లను నాటించడం జరిగిందని, గ్రామాల్లో ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ జరిగేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, సర్పంచ్ తులసారావు, పంచాయతీ కార్యదర్శులు ప్రభాకరరావు, వెంకటేశ్వర్లు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, టెక్నికల్ అసిస్టెంట్ సతీష్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

# డాక్టర్ పిచ్చయ్యకు పియం మోడీ విజన్ ఆఫ్ భారత్ అవార్డును ప్రధానం చేసిన మనం ఫౌండేషన్




(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, సెప్టంబర్ 23) యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటి, యడవల్లి ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాల నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోటీ పరీక్షలు వ్రాయడానికి అవసరమైన స్టడీ మెటీరియల్స్‌ను, అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ప్రధానం, ఆర్థిక సహకారాన్ని, మార్గదర్శకత్వాన్ని, మోటివేషనల్ స్పీచ్‌ను, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను తన సొంత నిధుల నుంచి ఖర్చు చేస్తూ స్వచ్ఛందంగా సేవ చేస్తున్నటువంటి వ్యక్తిగా యశ్వంత్ ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవాధ్యక్షులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులైన డాక్టర్ మొర్రి పిచ్చయ్య నిలిచారు. పొద్దుటూరుకు చెందిన అంతర్జాతీయ గుర్తింపు పొందిన మనం ఫౌండేషన్ వారు ఆన్ లైన్ ద్వారా సోమవారం పియం మోడీ విజన్ ఆఫ్ భారత్ అవార్డును ప్రధానం చేశారు. మనం సంస్థ వ్యవస్థాపకులు లాయర్ చక్రవర్తి మాట్లాడుతూ యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష రాసే మెలకువలు తెలుపుతూ అత్యధిక మార్కులు సాధించే విధంగా అవగాహన సదస్సు నిర్వహించడం, సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయని, వీరి సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డు ను ప్రధానం చేశామన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత పిచ్చయ్యను ఉద్యోగ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, పలువురు అభినందనలు తెలిపారు.

# గ్రంథాలయంలో కరెంటు బోర్డు ధ్వంసం ఆకతాయిలే కారణమని తెలిపిన గ్రంథాలయ అధికారి ఝాన్సీ



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, సెప్టెంబర్ 23)

యర్రగొండపాలెం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన శాఖ గ్రంథాలయం ఉండడంతో ఈ గ్రంథాలయానికి నిత్యం గ్రామంలోని ప్రజలు, విద్యార్థులు, నిత్యం న్యూస్ పేపర్లు, పుస్తకాలు చదువుకోడానికి వస్తూ తమ జ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ఉంటారు. ఇలా తమ జ్ఞానాన్ని పెంపొందించడానికి ఉపయోగపడే శాఖ గ్రంథాలయం యొక్క కరెంటు బోర్డును గుర్తుతెలియని ఆకతాయిలు ధ్వంసం చేశారని మంగళవారం గ్రంథాలయ అధికారి కే ఝాన్సీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా గ్రంథాలయం ముందు గుర్తుతెలియని ఆకతాయిలు సిగరెట్లు, సీసాలను, ఆహారం తిన్న పార్సెల్ లను పడేస్తున్నారని తెలియజేశారు. ఈ గ్రంథాలయం మనందరిదని బాధ్యతాయుతంగా నడుచుకోవాల్సిన బాధ్యత గ్రామ ప్రజల మీద ఉందని ఇలాంటి చర్యలు మరలా చేయకుండా ఉండాలని ఆకతాయిలకు ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

# వ్యవసాయాన్ని రైతుకు లాభసాటిగా చేయడమే లక్ష్యం

అనుబంధాల శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి దానికనుగుణంగా సమగ్ర ప్రణాలికను రూపొందించాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ప్రతి రైతుకు ఖర్చు తగ్గించి, ఉత్పత్తి పెంచేలా తదనుగుణంగా అధిక ఆదాయం పొందేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహిస్తూ యాంత్రీకరణలో భాగంగా రైతుల అవసరాలకు అనువైన యంత్రాలను గుర్తించాలన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని మూడు మండలాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ఆ మండలాల్లో రైతుల అవసరాలను గుర్తించి వ్యవసాయ మరియు దాని అనుబంధ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను అమలు చేస్తూ మంచి ఫలితాలు సాధించేలా యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, గ్రామస్థాయిలో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా మరింత కృషి చేయాలన్నారు. జిల్లాలో ఉద్యాన పంటల అభివృద్ధికి మంచి అవకాశం ఉందని, ప్రోటెన్షియల్ ఏరియాను గుర్తించి ఉద్యాన పంటల అభివృద్ధి పై రైతులను ప్రోత్సహించేలా కార్యాచరణ ప్రణాలికలను తయారుచేయాలన్నారు. జిల్లా లో సుక్ష్మ సేద్యం విధానాన్ని మరింతగా ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఒక లక్షా 6 వేల హెక్టార్లలో సుక్ష్మ సేద్యం విధానాన్ని అమలు చేస్తుండగా, మరో 1.01 లక్ష హెక్టార్లలో సుక్ష్మ సేద్యం విధానాన్ని అమలు చేయుటకు అవకాశం ఉందని అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించగా, రానున్న 2,3 సంవత్సరాల్లో లక్ష హెక్టార్లలో సుక్ష్మ సేద్యం విధానాన్ని అమలు చేయుటకు తీసుకోవాల్సిన చర్యలపై యాక్షన్ ప్లాన్ ను తయారుచేయాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్రలో భాగంగా జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా ప్రణాలికలు రూపొందించి అందుకనుగుణంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్, పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. పశుగ్రాసం పంపిణీ, పశు భీమా లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. మత్స్య శాఖ ద్వారా అమలు జరుగుచున్న కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ, నిర్దేశించిన విధంగా వృద్ధి రేటు సాధించేలా మత్స్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని అందుకనుగుణంగా యాక్షన్ ప్లాన్ ను తయారుచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయా శాఖలు ద్వారా అమలు జరుగుచున్న కార్యక్రమాలపై పవర్ పాయింటం ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జెడి రవి కుమార్, మత్స్య శాఖ జెడి శ్రీనివాసరావు, పకృతి వ్యవసాయ అధికారి సుభాషిని, మార్కెడ్ అధికారి శ్రీహరి, ఎపిఎంఐపి పిడి శ్రీనివాసరావు, జిల్లా సెరికల్చర్ అధికారి సుజయ్, జిల్లా ఉద్యాన శాఖాధికారి గోపి చంద్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే రోజుల్లో ప్రజలే అంతిమ తీర్పు ఇస్తారు

పూర్తిచేసిన ఘనత వైయస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. గత సంవత్సరం నుండి మెడికల్ కాలేజీలు పూర్తి అయినప్పటికీ ప్రభుత్వాలు మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధికి నోచుకోలేదని ధ్వజమెత్తారు. మూడు రోజుల నుంచి జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో మెడికల్ కాలేజీలను పివిపి పద్ధతిలో నడిపేందుకు, ప్రైవేటు వ్యక్తులకు దానధత్వం చేసేందుకు నిర్ణయం తీసుకోవటం సిగ్గుచేటు అన్నారు. ప్రైవేట్ టెండర్లు పిలిచి కాసులకు కక్కుర్తి పడి పేదల కోసం నిర్మించిన మెడికల్ కాలేజ్లను ప్రైవేటు వ్యక్తులకు దారతత్వం చేయడానికి కూటమి ప్రభుత్వం పన్నాగం పట్టిందని అన్నారు. ఈ హాస్పటల్లో స్కూల్లో ప్రభుత్వ పరంగానే ఉండాలి పేద ప్రజలకు మంచి విద్య అందించాలి, పేద ప్రజలకు నాణ్యమైనటువంటి సేవలు అందుతాయి కాబట్టి మీ నిర్ణయాన్ని పునః సమీక్షించుకొని వెనక్కి తీసుకొని ప్రభుత్వ పరంగానే ఉంచాలని ఈనెల 19వ తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రాయవరం దగ్గర ఉన్న మెడికల్ కాలేజీని సందర్శించడం జరిగినది. దానికి పోటీగా ఈనెల 21వ తేదీన మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి నాయకత్వంలో వారి ఓటమి నాయకులు అందరూ అక్కడికి వెళ్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మీద టిడిపి ఓటమి నాయకులు నిందలు మోపడం,సత్య ప్రచారాలు చేయటం తగదు అని హెచ్చరించారు. మెడికల్ కాలేజీ ప్రభుత్వపరంగా ఉన్న ప్రైవేటుపరంగా ఉన్న ఎటువంటి సమస్య లేదు 33 సంవత్సరాలు ప్రైవేట్ సంస్థకు ఇచ్చాము ఓపి ఉండదు ఎలాంటి ఫీజులు పెంచము ఇవన్నీ కూడా దృశ ప్రచారం వైసిపి వాళ్ళు చేస్తా ఉన్నారు. అంతేకాకుండా వైసిపి వాళ్ళు ఈ ప్రాంతానికి అన్యాయం చేశారంటూ వెలుగొండ ప్రాజెక్టు వైసిపి పార్టీ అధికారం ఉన్నప్పుడు 16% పనులు చేసింది తప్పుడు ప్రచారం చేయటం మానుకోవాలని అన్నారు. వ్యక్తిగతంగా మా నాయకులను వాడు వీడు అని ఇష్టం వచ్చినట్లు నోటికి కూడా పని చెప్పారు. వైయస్సార్ పార్టీ నాయకులు దుర్మార్గులు చెప్పులతో కొట్టాలి అని సభ్యకరంగా మాట్లాడటం సభవు కాదని హెచ్చరించారు. మెడికల్ కాలేజ్ గాని వెలిగొండ ప్రాజెక్టు గానీ జిల్లా కాబోతోంది అని అహంకారంతో మాట్లాడటం మంచి పద్ధతి కాదని అన్నారు. ఇంకోసారి ఇలా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాస్త మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషీర్ అలీ బే, తర్లుపాడు మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, కౌన్సిలర్ కనకదుర్గ, మండల కన్వీనర్ చెంచురెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# మానవత్వం చాటుకున్న వైసీపీ సోషల్ మీడియా టీం



అధికార ప్రతినిధి కొండూరి నవీన్ కృష్ణారెడ్డి, స్టేట్ సోషల్ మీడియా సెక్రటరీ సయ్యద్ జబీబుల్లా వారితో పాటు స్టేట్ పంచాయతీ రాజ్ జనరల్ సెక్రటరీ ముల్లంగి రవీంద్రరెడ్డి, నాగులుప్పలపాడు మండల కన్వీనర్ కుమారుడు యశ్వంత్, ఇనుగంటి రమణారెడ్డి, సంతనూతలపాడు నియోజకవర్గం సోషల్ మీడియా అధ్యక్షురాలు కామినేని ఝాన్సీ, ఒంగోలు సోషల్ మీడియా కో కన్వీనర్ యరమల చక్రపాణి పరామర్శించారు. వారి యోగక్షేమాల గురించి పార్టీ అధ్యక్షుడు బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి ఒంగోలు పార్లమెంటు పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుండూరు రవి అడిగి తెలుసుకున్నారు. కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటదని భరోసా తెలియజేశారు. వీటితో పాటు అందరూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కనిగిరిలో పీసీపల్లి వైసీపీ పంచాయతీ

ముద్దపాడు సర్పంచ్ భర్త మూలె రాజశేఖర్‌రెడ్డి, యర్రంరెడ్డి మోహన్‌రెడ్డిలను సమన్వయ కమిటీలో సభ్యులుగా నియమించారు. ఈ పది మంది నాయకులు పార్టీ కార్యక్రమాల నిర్వహణతో పాటు పార్టీ పదవుల కూడా చర్చించి నిర్ణయించినపుడే పీసీపల్లి మండలంలో ఎవరినైనా పదవుల్లో నియమించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. కానీ ఎంపిపి మాత్రం వైసీపీ ఎంపిటిసిలకు మొండి చెయ్యి చూపి టీడీపీతో మిలాఖత్ అయిన ఎంపిటిసి సతీష్‌కు మండల పరిషత్ నిధులను కేటాయించడం పై అధిష్టానం దృష్టికి తీసుకెళ్ళాలని కొందరు వైసీపీ నాయకులు దద్దాల వద్ద డిమాండ్ చేస్తున్నారు. దద్దాల ఆధ్వర్యంలో నియమించిన పది మందితో కూడిన సమన్వయ కమిటీ ఏ మేరకు కలిసి పని చేస్తుందో వేచి చూడాల్సి ఉంది....!

# వన్యప్రాణులను రక్షించడమే లక్ష్యం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, సెప్టంబర్ 23)

నల్లమల్ల ఫారెస్ట్‌లో వన్యప్రాణులను కాపాడుకోవడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని మార్కాపురం డిఎఫ్ఓ మహమ్మద్ రాహుఫ్ అన్నారు. మార్కాపురంలోని అటవీ శాఖ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండియాలోనే పెద్దదైన నల్లమల్ల ఫారెస్ట్ లోని వన్య ప్రాణులను కాపాడడానికి అని విధాలుగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎకో టూరిజంలో గైడ్లను ఏర్పాటు చేసి అడవుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. నల్లముల ఫారెస్ట్‌లో ఉండే పులుల సంఖ్య లెక్కింపు ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుందని,2026 వ సంవత్సరంలో కేంద్ర బృంద సభ్యుల ఆధ్వర్యంలో ట్రాప్ కెమెరాల ద్వారా పులుల లెక్కింపు జరుగుతుందని తెలియజేశారు.మార్కాపురం డివిజన్ ఫారెస్ట్‌లోని ఏడు రేంజ్‌లలో అటవీ శాఖ అధికారులు అన్ని విధాలుగా అడవి సంరక్షణ చేస్తున్నారని డీఎఫ్ ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్




## రెండు రోజుల పాటు జరిగిన ఈవెంట్

## 167 టీమ్‌ల ప్రదర్శన




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 23)

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలోని సీఎస్ సీడీఈ ఆధ్వర్యంలో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాక్ థాన్ నిర్వహించారు. సోమవారం, మంగళవారం రెండు రోజులపాటు ఈ హ్యాకథాన్ జరిగింది. 167 టీమ్ లు ఈ హ్యాక్ థాన్ లో పాల్గొని తమ ప్రాజెక్ట్ లను ప్రదర్శించాయి. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ వెబ్‌సైట్‌లో ఇచ్చిన వివిధ సమస్యలపై రిసెర్చ్ చేసి, వాటికి పరిష్కారం తెలుపుతూ వివిధ ప్రాజెక్ట్ లను క్విస్ కళాశాల విద్యార్థులు రూపొందించారు. విద్యార్థుల్లోని ప్రతిభను, వ్యవస్థాపక ఆలోచనలను ప్రదర్శించేందుకు ఇలాంటి హ్యాక్ థాన్ లు శక్తివంతమైన వేదికను అందిస్తాయని, సృజనాత్మకతతో కొత్త కొత్త ఆవిష్కరణలు చేయాలనే ఆలోచనలను పెంపొందింపచేస్తాయని విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి అన్నారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ లాంటి వేదికలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, జాతీయ స్థాయిలో రానించాలని ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి విద్యార్థులకు సూచించారు. ఇంటర్నల్ హ్యాక్ థాన్ లో గెలుపొందిన 50 టీమ్ లను నేషనల్ లెవెల్ ఈవెంట్ లో పోటీ పడతాయని, అక్కడ కూడా క్విస్ విద్యార్థులు తమ ప్రతిభను చూపిస్తారనే నమ్మకం ఉందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు అన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎస్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, సీఎస్ సీడీఈ డీన్ డాక్టర్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని డాక్టర్ ధరణి పర్యవేక్షించగా.. వివిధ విభాగాల హెచ్ వోడీలు జ్యూరి మెంబర్లుగా వ్యవహరించారు.



# జిల్లా ఎస్పీని కలిసిన జర్నలిస్టులు
# అభినందనలు తెలిపిన ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కమిటీ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 23)

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజును జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం స్థానిక ఎస్పీ ఛాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) జిల్లా కమిటీ నాయకులు ఎస్పీని ఘనంగా సత్కరించి పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు పోలీసులు ఘటనా స్థలంలో లేకపోతే బాధితులకు న్యాయం జరగదన్నారు. జిల్లాలోని జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రెస్ స్టిక్కర్ వేసుకొని తిరుగుతున్న ఇతరులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రకాశం జిల్లాలో ప్రెస్, పోలీస్ మధ్య స్నేహ పూర్వక వాతావరణం ఉంటుందని, పోలీసులకు మీడియా ప్రతినిధులు సహకరిస్తారని తెలియజేశారు. స్పందించిన ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఏదైనా పెద్ద సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులు స్పందిస్తారని, బాధితులకు న్యాయం చేసే వరకు కృషి చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడదామన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. తిరుపతిలో ఎస్పిగా పనిచేసిన సమయంలో జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు ఇచ్చామని, జిల్లాలో అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులందరికి త్వరలో గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. ప్రెస్ స్టిక్కర్లు వేసుకొని తిరుగుతున్న ఇతరుల వాహనాలను కట్టడి చేస్తామని హామీ ఇచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లాలోని జర్నలిస్టులు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎస్పి కోరారు. కార్యక్రమంలో మీడియాకెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షులు వి నాగేశ్వరరావు, ఎపిడబ్ల్యుజెఎఫ్ మాజీ అధ్యక్షులు, సూర్య దినపత్రిక బ్రాంచ్ మేనేజర్ గొట్టిపాటి నాగేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షులు వి భక్తవత్సలం, కోశాధికారి వి కోటయ్య, మీడియా ప్రచార కార్యదర్శి ఎల్ రాజు, పి9 మేనేజింగ్ డైరెక్టర్ పి కిరణ్, టివి9 స్టాఫ్ రిపోర్టర్ ఫైరోజ్ బేగ్, 10 టివి స్టాఫ్ రిపోర్టర్ శంకర్, ఐ న్యూస్ స్టాఫర్ సుధాకర్, ఆంధ్రప్రభ బ్రాంచ్ మేనేజర్ కారసాల అశోక్ బాబు, బ్యూరో ఇన్చార్జి పి విజయ భాస్కర్‌రెడ్డి, స్టాఫర్ ఆర్వి రాజశేఖర్, ఫొటో గ్రాఫర్ ఏ రాజశేఖర్, టివి99 స్టాఫర్ బొడ్డు శ్రీనివాసరావు, జర్నలిస్టులు పి శ్రీనివాస్, ఎం ప్రసాద్‌బాబు, బి వెంకట్రావు, రాజశేఖర్, బాషా పాల్గొన్నారు.

# కనిగిరి డిపోలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, సెప్టెంబర్ 23)





దేశవ్యాప్తంగా జరుగుతున్న "స్వచ్ఛతా హి సేవా" కార్యక్రమంలో భాగంగా కనిగిరి ఆర్‌టిసి డిపోలో మంగళవారం డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవ – స్వచ్ఛతే భవిష్యత్ అనే నినాదంతో స్వచ్ఛతా హి సేవా శుభ్రతా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. బస్టాండ్, డిపో పరిసర ప్రాంతాల్లో చెత్త తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాలను పరిశు భ్ర చేశారు. ప్రజా రవాణా ఉద్యోగులకు, ప్రయాణికులకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యకరమైన సమాజానికి పునాదని అన్నారు. ప్రతి పౌరుడు తన ఇల్లు, వీధి, బస్టాండ్, పబ్లిక్ ప్రదేశాలను ఎల్లప్పుడూ శు భ్రంగా ఉంచే బాధ్యత వహించాలని తెలిపారు. కమిషనర్ పి కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం తగ్గించి, పునర్వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని అని పిలుపునిచ్చారు. అదే విధంగా స్వచ్ఛత కేవలం ప్రభుత్వం లేదా సంస్థల బాధ్యత కాకుండా ప్రజలందరి సహకారంతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ షేక్ నాయబ్ రసూల్, సచివాలయం శానిటరీ సెక్రటర్లు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ రమేష్ బాబు, బిఎస్‌ఎం సుబ్బారావు, ఆర్‌టిసి సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఆరోగ్యం పట్ల కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

## ఏఎంసీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమామ్ సాహెబ్







(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 23)

పొదిలి సచివాలయం 4లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాం సాహెబ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శరత్ చంద్ర, విద్యాసాగర్ ఆధ్వర్యంలో మహిళలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాం సాహెబ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన స్వస్థనారి స్వసక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ మౌలాలి, భాష, సుబ్బయ్య, సుభాని, శ్రీకాంత్, మెహరున్నీసా బేగం, ఏఎన్‌ఎం విజయ, సారా, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేసిన పోలీసులు





**(షణ్ముఖ వెలుగు, నాగులుప్పలపాడు, సెప్టెంబర్ 23)**

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వుల మేరకు మంగళవారం నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో గల గ్రోమోర్ సెంటర్‌ను ఒంగోలు రూరల్ సిఐ ఎన్ శ్రీకాంత్ బాబు, ఎస్ఐ షేక్ రజియా సుల్తానా తనిఖీలు చేసి అక్రమ యూరియ నిల్వల గురించి విచారించారు. ఈ తనిఖీలో మహిళ పోలీస్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, సెప్టెంబర్ 23)**

కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మణికేశ్వరం గ్రామంలో నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షుడు షేక్ కరిముల్లా స్థానిక నేతలు ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులను ఆందజేసి లబ్దిదారులకు కొత్త కార్డుల లాభాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ స్మార్ట్ కార్డులు పారదర్శకతతో కూడిన సరఫరా వ్యవస్థను అందిస్తాయని. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రేషన్ సదుపాయాలను పొందాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ ధారవి, తెదేపా నేతలు బడావలి, ఆదినారాయణ, మాధ్యూస్, బలరామిరెడ్డి, ప్రసాద్, రత్నం, ఆంజనేయులు, ఫకీర్, అనీల్, ప్రకాష్, ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.

# చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో వైభవంగా రెండవ రోజు శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు

## గాయత్రి దేవి అలంకారంతో భక్తులకు దర్శన భాగ్యం కలిగించిన పార్వతీ అమ్మవారు







**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, సెప్టెంబర్ 23)**

హరిద్రా అభిషేకం పూజలతో భక్తులను అనుగ్రహించిన వాసవి అమ్మవారు చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం అమ్మవారు శ్రీ గాయత్రి దేవి అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు.రాష్ట్ర మాజీమంత్రి శిద్దా రాఘవరావు వారి సతీమణి శిద్దా లక్ష్మి పద్మావతి ఆద్వర్యంలో మంగళవారం శ్రీ వాసవి అమ్మవారికి పాంచామృత సుగంధ ద్రవ్యాల అభిషేకాలు నిర్వహించి తదుపరి అమ్మవారికి శ్రీ చక్రార్చన సాయంత్రం ఉభయదాతల చే కుంకుమ అర్చన, ఆర్యవైశ్య మహిళలచే సామూహిక శ్రీ లలితా సహస్ర నామ సోత్స్రం, పారాయణం, శ్రీ చక్రార్చన, నవావరణ పూజ, శ్రీ పార్వతీ సమేత నగేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, నైవేద్యం, మహాహారతి, తీర్ధప్రసాదాల భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ దేవీ శరన్నవరాత్రులు సందర్భంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి విశేషంగా 108కిలోల పసుపుతో అభిషేకం అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. బుధవారం అన్నపూర్ణదేవి అలంకారం, ధాన్యభిషేకం నిర్వహిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. శిద్దా వెంకటేశ్వర్లు, శ్రీమతి వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శిద్దా పాండురంగారావు దంపతులు, శిద్దా పెద్దబాబు దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు, కొనిజేటీ సువర్ణ, గాదంశెట్టి లక్ష్మి, చలువాది మాధవి, కూరపాటి ధనలక్ష్మి, దాట్ల సువర్చల, ఏ అరుణ, శిద్దా లక్ష్మి పద్మజ, మహిళా భక్తులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ డిఎంను సద్వినియోగం చేసుకోండి



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, సెప్టెంబర్ 23)**

కనిగిరి ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించే డయల్ డిఎం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ సయానా బేగం తెలియజేశారు. బుధవారం ఉదయం 10:30 గంటల నుంచి 11:30 వరకు 9959225701 నెంబర్ కి ఫోన్ చేసి కనిగిరి డిపో పరిధిలో ఉన్న ప్రజలు తమ సమస్యలతోపాటు సూచనలు,సలహాలు తెలియజేయవచ్చునని తెలిపారు.

# అర్జీదారులతో అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తే కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 23)**

సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీదారులతో అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా ఉద్యోగులు, అధికారులు ప్రవర్తిస్తే ఊరుకోనని హెచ్చరించారు. మంగళవారం ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, డిఆర్ఓ బి చిన ఓబులేసుతో కలిసి మండల స్థాయి అధికారులతో రెవెన్యూ సంబంధిత అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'కోరుకున్నచోటకు పోస్టింగ్ వచ్చింది కదా, ఇక పరవాలేదులే అనుకుని ప్రజలతో ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే సహించబోను' అన్నారు. సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో వస్తున్న ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని దిశానిర్దేశం చేశారు. ' మీకోసం ' కార్యక్రమానికి వస్తున్న అర్జీలలో ఎక్కువగా రెవెన్యూ సంబంధిత అంశాలవే ఉంటున్నాయన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున జిల్లాలోని అధికార యంత్రాంగం కూడా అదే దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్న టాప్ - 10 అంశాలకు సంబంధించిన వివరాలను ఎల్లవేళలా అధికారులు తమ టేబుల్ పై ఉంచుకొని, వాటికి సంబంధించిన పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ ఉండాలన్నారు. ప్రజలు ప్రస్తావించిన, మీడియాలో వస్తున్న సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేసినా, విక్రయించినా కేసులు నమోదు

## వ్యవసాయశాఖ రాష్ట్ర కమిషనర్ ఢిల్లీరావు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, సెప్టెంబర్ 23)

బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేసినా, విత్తనాలు సరఫరా చేసినా, విక్రయించినా, సహకరించిన వారిపై పకడ్బందీగా కేసులు నమోదు చేయాలని వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఢిల్లీరావు తెలిపారు. అన్ని జిల్లాల సంయుక్త కలెక్టర్లు, వ్యవసాయ, మార్కె ఫెడ్ శాఖ అధికారులతో మంగళవారం రాజధాని అమరావతి నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. నర్సరీలలోనైనా బ్లాక్ బర్లీ పొగ నారు వేస్తే కేసులు నమోదు చేయాలని వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్ చెప్పారు. జీవో నెంబర్ 740 పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీలు సమర్థంగా పని చేయాలన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిల్లా స్థాయిలో కమిటీలో ఉండాలని చెప్పారు. డివిజన్ స్థాయిలో ఆర్డిఓ, డిఎస్పి, వ్యవసాయ శాఖ ఏడి, ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రోగ్రెసివ్ ఫార్మర్స్ కమిటీలో ఉన్నారని చెప్పారు. అలాగే మండల స్థాయిలో తహసిల్దార్, ఎస్సై, మండల వ్యవసాయ శాఖ అధికారి, రైతులు కమిటీలో సభ్యులుగా ఉంటారన్నారు. పొగాకుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమలు చేయాలన్నారు. కొనుగోలులో పొగాకు తేమ శాతం 20 కంటే తగ్గకుండా చూసుకోవాలన్నారు. కమిటీలు సమర్థంగా పనిచేస్తేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. బాపట్ల జిల్లాలో 13,600 టన్నుల పొగాకును కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని డిల్లీరావు చెప్పారు. 8,057 మంది రైతుల నుంచి 12,614 టన్నుల పొగాకును కొనుగోలు చేశామన్నారు. మరో ఒక వెయ్యి టన్నులు పొగాకును కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం సూచన మేరకు ఆయా కంపెనీలు 20 వేల టన్నుల పొగాకును కొనుగోలు చేశాయని వివరించారు. మరోసారి ఇలాంటివి పునరావృతం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వీక్షణ సమావేశంలో జిల్లా నుంచి జిల్లా ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, వ్యవసాయ శాఖ అధికారిని అన్నపూర్ణ, మార్క్ ఫెడ్ జిఎం కరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టరేట్ వద్ద కారుమంచి కాలువ రైతుల ధర్నా





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 23)

కారుమంచి కాలువ పరిధిలోని గ్రామాల రైతులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల పరిధిలో దాదాపు 20 గ్రామాలకు ఎన్ఎస్పి కాలువ ద్వారా కారుమంచి మేజర్ నుంచి గత 30 సంవత్సరాలుగా సాగు, తాగునీరు అందుతుంది. రామతీర్థం జలాశయము కట్టిన తర్వాత మా గ్రామ ప్రజలు ఎంతో సంతోషించారు కానీ 2019లో కారుమంచి మేజర్ ద్వారా సాగు, త్రాగునీరు అందించే కాలువ మధు ఖాన్ గ్రానైట్ వద్ద తెగిపోయింది. కారుమంచి మేజర్ పరిధిలో దాదాపు 18 వేల ఎకరాల ఆయకట్టు సాగు జరుగుతుంది ఈ కారు నుంచి మేజర్‌కి 130 క్యూసెక్కుల నీరు ఇవ్వవలసి ఉండగా గతంలో మధు ఖాన్ గ్రానైట్ దగ్గర కాలవ గండి పడటం వలన దాని పక్కగా తాత్కాలిక కాలవ నిర్మాణం చేసి ఉన్నారు. కావున ఇప్పుడు 40 క్యూసెక్కుల నీరు మాత్రమే సరఫరా అవుతుంది ఈ నీరు మొదట ఉన్న రెండు మూడు గ్రామాలకే సరిగా అందటం లేదు ఇక చివరి గ్రామాలు కనీసం త్రాగునీటికి కూడా నీళ్లు రావడం లేదు 20 గ్రామాల రైతులు ఈ ఆయకట్టు పరిధిలో సాగు చేస్తున్నారు. మేము గతంలో ఈ సమస్యను నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ప్రస్తావించి చూపించి ఉన్నాము. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్ ఎపిడిఎంఎఫ్ నిధులను రూ.2.63 కోట్లు గవర్నమెంట్ ద్వారా మంజూరు చేయించి ఉన్నారు. కానీ ఈ కాలవ నిర్మాణాన్ని మధుఖాన్ గ్రానైట్ యాజమాన్యం వారు అడ్డుకుంటున్నారు ఈ కాలవ కింద ఉన్న నిధి నిక్షేపాలు కోసం ఈ స్థలాన్ని మాకు కేటాయిస్తే కాలవ నిర్మాణం ల్యాండ్ రిక్రూట్మెంట్ ద్వారా కొంచెం ముందు నుంచి తీస్తాం అని అంటున్నారు కానీ వారు చెప్పే పద్ధతిలో నీరు క్రింది నుంచి మెరకకు వాటర్ రావాలి కానీ గ్రావిటి ద్వారా అలా రావు కావున పాత డిజైన్ ప్రకారమే కాలవనిర్మాణం చేస్తే తప్ప ఈ గ్రామలలో ఉన్న రైతులకి కిందికి నీళ్ళు అందించలేరు.

ఐదు సంవత్సరాల క్రితం కారుమంచి కాలువ కు గండి పడటం వలన ఆయకట్టు పరిధిలోనే రైతులు సాగునీరు లేక చాలా నష్టపోతున్నారు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం కారుమంచి కాలువ గండి పుడ్చటానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ మేజర్ పరిధిలో దాదాపుగా 10 మంచినీటి వాటర్ ట్యాంకులు కూడా ఉన్నాయి. అందువలన ప్రజలకు సాగు తాగునీరు అందలేక, అదే విధంగా పశువులకు త్రాగడానికి నీరు లేక పశుపోషకులు కూడా చాలా ఇబ్బంది పడుతున్నారు. కావున జిల్లా కలెక్టర్ మా రైతుల బాధను గమనించి డిఎంఎఫ్ నిధులు త్వరగా విడుదల చేసి కారుమంచి మేజర్ కాలువ నిర్మించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి రూరల్ టిడిపి అధ్యక్షులు జి రాఘవరావు, మద్దిపాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ మన్నం ప్రసాద్, కాట్రగడ్డ రవశ యని, చీమకుర్తి కారుమంచి డిసి ప్రెసిడెంట్ పాలడుగు వెంకట నారాయణ, తదితర రైతులు పాల్గొన్నారు.

# మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు మెరుగైన వసతులు కల్పించాలి

## అసెంబ్లీలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టెంబర్ 23)


మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు మెరుగైన వసతులు కల్పించాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో మార్కాపురం జనరల్ హాస్పిటల్ మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన మార్కాపురం డివిజన్‌లో మార్కాపురం నియోజకవర్గం, గిద్దలూరు నియోజకవర్గం, యర్రగొండపాలెం నియోజకవర్గాలు ఉన్నాయని ఈ ప్రాంతంలో అత్యంత వెనుకబడిన చెంచులు, లంబాడి ప్రజలు నివసిస్తారని వారు మెరుగైన వైద్య సహాయం పొందాలంటే మార్కాపురం హాస్పిటల్ లోనే సాధ్యమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో 2014–19 కాలంలో మార్కాపురం జనరల్ హాస్పిటల్ జిల్లా ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేశారని గుర్తు చేశారు. ఇక్కడ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో సరైన సదుపాయాలు లేక చిన్న చికిత్సకు కూడా నరసరావుపేట గుంటూరు విజయవాడ ఒంగోలు పట్టణాలకు వెళ్లాల్సి వస్తుందని తద్వారా ప్రజల డబ్బు సమయం వృథా అవుతున్నాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. హాస్పటల్ 350 పడకల ఆసుపత్రిగా ఉందని కానీ దానికి తగ్గట్టు వైద్యులు గాని మౌలిక సదుపాయాలు గాని సిబ్బంది గానీ లేదని గుర్తు చేశారు. ఈ హాస్పటల్లో 113 మంది వైద్యులు కానీ 23 మంది వైద్యులే ఉన్నారని 453 మంది స్టాఫ్ ఉండాల్సిందని కానీ ఇప్పుడు 113 మంది స్టాఫ్ మాత్రమే హాస్పటల్లో పనిచేస్తున్నారని ఇంకా ఎక్విప్మెంట్ విషయానికి వస్తే అంబులెన్సులు కొరత ఉందని కనీసం ప్లాంట్ కూడా రిపేర్ లో ఉందని ఆక్సిజన్ ప్లాంట్ కూడా రిపేర్ లో ఉన్నదని ఇక ఈ ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్నారని డయాలసిస్ సెంటర్ కూడా దాతల సహకారంతో నడుస్తుందని డాక్టర్ కూడా నెలకు రెండుసార్లు వచ్చి వెళ్తున్నారని అన్నారు. ఇటీవలే హాస్పటల్లో ఉన్న అత్యంత కీలకమైన ఐసియు వార్డు దాతల సహకారంతో తిరిగి ప్రారంభించామని కానీ అక్కడ ఐసియుకు సంబంధించిన డాక్టర్ల కొరకు ఉన్నదని అన్నారు. ప్రజా ప్రభుత్వం అయిన మన ప్రభుత్వం వెంటనే స్పందించి మార్కాపురం జిల్లా ఆసుపత్రిని డెవలప్ చేయాలని కోరారు.



# ఉప్పుగుండూరు నాగేశ్వరరావు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన పియస్ఆర్

(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, సెప్టెంబర్ 23)

తెలుగుదేశంపార్టీ మద్దిపాడు మండల అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా మద్దిపాడు మండల టిడిపి కార్యాలయంలో మంగళవారం కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్దిపాడు మండల తెలుగు యువత మాజీ అధ్యక్షులు పోతినేని శ్రీనివాసరావు (పి.యస్.ఆర్) బొకే అందజేసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ మద్దిపాడు మండలంలో ఎమ్మెల్యే బి.యన్. విజయ్ కుమార్ గారి ఆదేశాలతో మద్దిపాడు మండలం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ, ఇలాగే మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గట్టినేని అయ్యన్న, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మందపల్లి శ్రీనివాసరావు, అడక స్వాములు, ముప్పా రవి, మార్నేని రాఘవ, మద్దిపాడు మండలంలోని పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.





# వరద విపత్తు వస్తే ఏ ఒక్క ప్రాణానికి నష్టం జరగకూడదు

## జిల్లా కలెక్టర్ వి వినోద్‌కుమార్



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, సెప్టంబర్ 23)

వరద విపత్తు వస్తే లంక గ్రామాలలో ఏ ఒక్కరి ప్రాణానికి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో కొల్లూరు, భట్టిప్రోలు రేపల్లె మండలాల సర్పంచ్ లు, అధికారులతో మంగళవారం భట్టిప్రోలు మండలం తాహసిల్దార్ కార్యాలయం వద్ద ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వరద విపత్తు వస్తే సమర్ధంగా ఎదుర్కోవాల్సిన బాధ్యత సర్పంచ్ లు, అధికారులపై ఉందని కలెక్టర్ చెప్పారు. విపత్తును ఎదుర్కోవడానికి సర్పంచ్ లు, అధికారులు సంసిద్ధం కావాలన్నారు. లంక గ్రామాల ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా నేను మీకు అండగా ఉంటాను, ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆయన భరోసా ఇచ్చారు. సమాజంలో నాయకులుగా ఉన్న సర్పంచులు ప్రభుత్వంతో కలిసి పని చేయాలన్నారు. సమష్టిగా పనిచేస్తేనే విపత్తు నష్టాన్ని నివారించగలమన్నారు. సర్పంచులు తమ ఆర్ధిక వనరులు, పరిపాలన అధికారాలను సమర్ధంగా వినియోగించుకోవాలన్నారు. స్థానిక గ్రామాలలోని యువకులను ఐక్యం చేసి సామాజిక సేవల వైపు మళ్లించాలన్నారు. లంక గ్రామాలలోని ప్రజలెవరికీ ఎలాంటి ప్రాణ హాని ఉండరాదన్నారు. కృష్ణా నది వరద ప్రవాహంపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని వీఆర్వోలు, సర్పంచులకు చేరవేస్తామన్నారు. ప్రమాదం పొంచి ఉన్నందున లంక గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. లంక గ్రామాలను విడిచి సురక్షిత ప్రాంతాలకు తరలి రావడానికి సిద్ధం కావాలన్నారు. విపత్తు హెచ్చరిక, ప్రభుత్వ సూచనలను పాటిస్తే ప్రజలకు మేలు జరుగుతుంద అన్నారు. ఆ సమయంలో ఎలా చేస్తే నష్టాన్ని నివారించగలమో ప్రణాళికలు రూపొందించాలంటూనే వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. తక్షణమే చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అవసరమైతే లంక గ్రామాలున్న పొరుగు జిల్లా కలెక్టర్లతోను మాట్లాడతానని వారికి భరోసా ఇచ్చారు. కృష్ణానది కట్ట, కరకట్ట బలోపేతంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జిల్లా కలెక్టర్ తెలిపారు. కరకట్ట బలహీనంగా ఉన్న ప్రాంతాలలో గండ్లు పడకుండా ఇసుక బస్తాలు, కంకర చిప్స్, సరుగుడు కర్రలు సిద్ధం చేయాలన్నారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని నివారణ చర్యలు సత్వరమే ప్రారంభించాలన్నారు. వరద ముంపునకు గురయ్యే లంక గ్రామాలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. తద్వారా ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి రావడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అవసరమైన పడవలు అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఆ గ్రామాలలో సహాయక చర్యల కొరకు పడవలు నడిచే ప్రాంతాలైనా ఫెర్రీ పాయింట్లను గుర్తించాలన్నారు. కృష్ణానది కరకట్టను బలోపేతం చేయాలని ఆయా గ్రామాల సర్పంచులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ప్రధానంగా కొల్లూరు మండలం కొల్లూరు కెనాల్ లాకుల వద్ద నుంచి పెనుమూడి వరకు కరకట్ట బలహీనంగా ఉందని సర్పంచులు చెప్పారు. ఐదు కిలోమీటర్ల మేర కరకట్టను బలోపేతం చేస్తే ప్రతి ఏటా ఏర్పడే విపత్తునకు ఆందోళన చెందడాన్ని నివారించగలమని కలెక్టర్ కు వివరించారు. ప్రాణ, ఆస్తి నష్టాలను అరికట్టవచ్చన్నారు. వరద విపత్తుతో ఓలేరు పెద్దపులివారి పంచాయితీలో 5,200 ఎకరాల సాగు భూమిలో వ్యవసాయ, ఉద్యాన పంటలన్నీ దెబ్బతింటున్నాయని చెప్పారు. పడవలు అందుబాటులో ఉంటే ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. వరద సమయంలో ముఖ్యంగా తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే లంక గ్రామాలలో కాల్వలలో చెట్లు తొలగించాలన్నారు. దోనెపూడి చప్టా వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. కిష్కింధపాలెం వద్ద పడవలు వెళ్లే మార్గంలో చెట్లు తొలగించాలని విన్నవించారు. కృష్ణానదిపై నిర్మించిన అరవింద వారధి సమీపంలో ఇసుక తవ్వకాలు జరగకుండా నియంత్రించాలని కోరారు. ఈ సమావేశంలో రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె మండలాల తహసిల్దార్‌లు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు ఎం.శ్రీనివాసరావు, ఆయా మండలాల 28 మంది సర్పంచ్ లు పాల్గొన్నారు.





# కృష్ణానది కరకట్టలు యుద్ధ ప్రాతిపదికన అధికారులు బలోపేతం చేయాలి

## జిల్లా కలెక్టర్ వి వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, సెప్టంబర్ 23)

కృష్ణానది కరకట్టలు యుద్ధ ప్రాతిపదికన అధికారులు బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలో బలహీనంగా ఉన్న కృష్ణానది కరకట్టలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. దోనెపూడి చప్టా మీదుగా ఇప్పటికే వరద ప్రవాహం వస్తుందని తెలుసుకున్న కలెక్టర్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. దోనెపూడి చప్టా మీదుగా ఎవరిని వెళ్లనివ్వకుండా పోలీసులను నియమించారు. పటిష్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. అనంతరం దోనెపూడి ఫెర్రీ పాయింట్, కొల్లూరు లాక్ ల వద్ద ఫెర్రీ పాయింట్, వెల్లటూరు, వెల్లటూరు ఫెర్రీ పాయింట్, పెద్దపులివర్రు వద్ద కరకట్ట బలహీనంగా ఉన్న ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. బలహీనమైన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. సహాయక చర్యలు తక్షణమే చేపట్టాలన్నారు. ఇసుక, కంకర గ్రావెల్ కలిపి కట్టను బలోపేతం చేయాలని కొల్లూరు ఈ డబ్ల్యు ఆర్ సి విజయరాజుకు సూచించారు. వెల్లటూరు ఫెర్రీ పాయింట్ వద్ద రెగ్యులేటర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కలెక్టర్లను అభ్యర్థించారు. వరద విపత్తు వస్తే సహాయక చర్యల కొరకు బోట్లు ప్రయాణించే దోనెపూడి ఫెర్రీ పాయింట్, వెల్లటూరు వద్ద ఫెర్రీ పాయింట్ లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె మండలాల తహసిల్దార్ లు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు ఎం.శ్రీనివాసరావు, జల వనరులశాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.



# సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు

## జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 23)

ప్రజలు, ప్రజా ప్రతినిధులపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడితే, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారంగా ఇతరులపై నిరాధారమైన ఆరోపణలు చేయడం, వాట్సాప్ గ్రూపులు, ఇన్‌స్టాగ్రామ్ వంటివి వాడుకొని అసభ్యంగా వ్యాఖ్యానించడం పట్ల పోలీసులు తీవ్ర దృష్టి సారించారని తెలిపారు. మహిళలపై, ఇతరులపై కించపరిచే రీతిలో వ్యాఖ్యలు చేయడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడడం, కులం, మతాల మధ్య విభేదాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం లాంటి చర్యలపై కఠిన చర్యలు తప్పవన్నారు. సోషల్ మీడియా వేదికలపై పోలీస్ శాఖ నిరంతర నిఘా పెట్టి వ్యవహరిస్తోందని ఎస్పీ తెలిపారు. సమాజాన్ని కలవరపెట్టేలా కాకుండా, వాస్తవాలను తెలుసుకున్న తర్వాతనే సోషల్ మీడియాలో ఏదైనా పోస్ట్ చేయాలని ప్రజలకు సూచించారు. యువత సోషల్ మీడియాను మంచి కోసమే వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com